క్లుప్తంగా

యూరియా, డీఏపీ ప్రభుత్వమే అందజేయాలి

పార్వతీపురం టౌన్: జిల్లాలో ఎరువులు, యూరియా కొరత తీవ్రంగా ఉందని డీఏపీ యూరియాకు బదులు నానో యూరియాను రైతులకు అంటగడుతున్నారని ఏపీ రైతు సంఘం ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తుందని పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. రైతు సంక్షేమం ప్రభుత్వ ప్రకటనలకే పరిమితమైందని, ఆచరణలో లేదని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు సరిపడా ఎరువులు యూరియా ఇవ్వకపోగా పురుగు మందులు కూడా తప్పకుండా తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. రైతు సమస్యలపై ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు రైతులంతా కదలిరావాలని పిలుపునిచ్చారు.

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర లక్ష్యం


సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న సబ్ కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి

పార్వతీపురం టౌన్: స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ప్రధాన లక్ష్యం గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడమే అని పార్వతీపురం సబ్ కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి అన్నారు. పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో శనివారం ఆమె పాల్గొని చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి వ్యక్తిగత, సామాజిక బాధ్యతను పెంచడం దీని యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. పరిసరాల పరిశుభ్రత తో పాటు వ్యక్తిగత పరిశుభ్ర అవసరం అన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైకేఎం కాలనీలో రహదారులు నిర్మించాలి


పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకంపేట పంచాయతీ పరిధిలో జిల్లా కేంద్రానికి ఆనుకొని వున్న వైకేఎం కాలనీలో వీధి రోడ్లు లేక అవస్థలు పడుతున్నామని, రహదారులు వేయాలని స్థానికులు వాపోతున్నారు. ఎన్నికల సమయంలో వచ్చిన కూటమి నేతలు నేటికి కన్పించడం లేదని రోడ్లు నిర్మాణం లేక తుప్పలు, డొంకల మధ్య నడుస్తూ భయాందోళన చెందాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంపడితే బురదగా మారి అధ్వానంగా దారులు తయారవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వీధిరోడ్లతో పాటు ప్రధాన రహదారిని కూడా నిర్మాణం చేసి ఇరు వైపులా కాలువలు నిర్మించాలని కోరారు.

అసంపూర్తి కాలనీ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

సీతానగరం: అసంపూర్తి కాలనీ ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.శ్రీనివాసరావు కోరారు. ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్, హౌసింగ్ ఏఈ జానకీరాం, డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మతో కలిసి గుచ్చిమి లేఅవుట్‌లో పునాదులతో నిలిచిన గృహ నిర్మాణాలను ఆయన శనివారం పరిశీలించారు. అనంతరం గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనంగా రూ.50వేలు పెంచిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సొంతింటి కల నెరవేర్చుకోవాలని సూచించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఏటీఎల్ ప్రయోగశాలను పరిశీలించిన డీఈవో


ఏటీఎల్ ప్రయోగశాలను పరిశీలిస్తున్న డీఈవో రాజ్‌కుమార్

సాలూరు: స్థానిక పీఎన్ బొడ్డవలస గురుకుల పాఠశాలను డీఈవో రాజకుమార్ పరిశీలించారు. అక్కడ ఏటీఎల్ ప్రయోగశాలను పరిశీలించి, విద్యార్థులు చేసిన ప్రాజెక్టులను అడిగి తెలుసుకున్నారు. ఏటీఎల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మూర్తి, ఏటీఎల్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి..

సాలూరు రూరల్: వినాయక మంటపాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని రూరల్ ఎస్సై నరసింహమూర్తి అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉత్సవ కమిటీ సభ్యులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సుమారు 40 గ్రామాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎరువుల కొరతతో రైతుల యాతన!

- సాగులో అవస్థలు
- బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయాలు
- ఎటూ తేల్చుకోలేని అన్నదాత


ఎరువులు చల్లేందుకు సిద్ధంగా ఉన్న వరి మడులు

పార్వతీపురం రూరల్:

ఎరువుల కొరత తీవ్రంగా రైతులను వేధిస్తోంది. ఇప్పటికే ఉభాలు వేసి ఎరువులు చల్లేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. ఎరువుల కొరతపై తారా స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నా.. స్థానిక కూటమి నేతలు ఫొటోలకు ఫోజులిచ్చిన కార్యక్రమాల్లో పాల్గొంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్యపై స్పందించి పరిష్కారానికి చొరవ చూపడం లేదు. ప్రస్తుతం పార్వతీపురం మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు 18,600 ఎకరాలు కాగా మొక్కజొన్న తదితర ఉద్యానవన పంటలు 5,186 ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగు చేసేందుకు ఇప్పటికే రైతులు నాట్లు దశను పూర్తి చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుతం రెండో దఫా యూరియాను చల్లాల్సిన పరిస్థితి సంతరించుకోవడంతో రైతులకు కనుమేర చూపులు ఎక్కడా యూరియా లేకుండా పోయింది. అధికారుల లెక్కల ప్రకారం ప్రస్తుతం సీజనల్ కండీషన్‌గా మండలంలో మొత్తం 1240 మెట్రిక్ టన్నులు అవసరమైతే ఇప్పటికే 464 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాల ద్వారా అలాగే డిపోల ద్వారా మరో 180 మెట్రిక్ టన్నులు యూరియాను సరఫరా చేశామని, ఇంకా 596 మెట్రిక్ టన్నులు మాత్రమే వివిధ దఫాలుగా పంట అవసరానుసారం పంపిణీ చేయాల్సి వుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఉద్యమిస్తాం..



జిల్లాలో ఎరువుల కొరత తీవ్రంగా ఉంది. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఆచరణలో చూపించడం లేదు. ప్రైవేటు వ్యాపారులు ఎరువులతో పాటు పురుగు మందులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. 264 ఉన్న యూరియా బస్తాను బ్లాక్ మార్కెట్‌లో రూ.600లకు విక్రయిస్తున్నారు. వస్తున్న ఎరువులు టీడీపీ నేతల ఇళ్లకు చేరుతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఎరువులను పంపిణీ చేయాలి. లేకుంటే ఉద్యమిస్తాం.

– ఎం.కృష్ణమూర్తి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

ఎరువులొచ్చిన కొంత సమయానికే..!

రైతు సేవా కేంద్రాలకు ఇటీవల కాలంలో వచ్చిన ఎరువులు కొద్ది సమయానికే ఒక్క బస్తా కూడా లేకుండా అయిపోవడం రైతులకు ఒకింత ఆశ్చర్యంతో పాటు ఆందోళన కలిగిస్తుంది. స్థానిక రాజకీయ నాయకుల పెత్తనంతో వచ్చిన నిల్వలను సిఫార్సు చేసిన వారికే కావల్సినంత ఎరువులను అప్పగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు యూరియా లోటును ఆసరాగా చేసుకున్న ప్రైవేటు వ్యాపారులు కొందరు, మరికొన్ని పురుగుల మందులు తమ వద్ద కొంటేనే రైతులకు అవసరమైన యూరియాను విక్రయిస్తామంటూ మెలిక పెడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సక్రమంగా యూరియా ఇస్తే రూ.264, డీఏపీ రూ.1350 ఖరీదు ఉండగా ప్రైవేటు వ్యాపారులు స్థానికంగా ఉన్న డిమాండ్ మేరకు అదనంగా రైతుల నుంచి వసూళ్లు చేస్తున్నారు. అంతేకాకుండా పార్వతీపురం మండలంలోని ఏవోబీ ప్రాంతాలకు సమీపంలో ఉన్న కొన్ని గ్రామాల్లో అనుమతులు లేని వారు కూడా ఎరువులను రహస్య ప్రాంతాల్లో నిల్వలు ఏర్పరుచుకొని జోరుగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా ఎరువుల కొరతతో ప్రభుత్వం తమను ఇబ్బందుల్లోకి నెట్టిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.అర కోటితో సీతానగరం – అజ్జాడ రహదారికి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్...

సీతానగరం: సీతానగరం – అజ్జాడ రహదారికి రూ.50 లక్షలతో మరమ్మతులు చేపట్టనున్నట్టు సీతానగరం ఆర్అండ్‌బీ ఏఈఈ కె.విజయకుమార్ తెలిపారు. ఆగస్టు 19న సాక్షిలో చెరువులను తలపిస్తున్న రోడ్లు కథనానికి అధికారులు శనివారం స్పందించారు. సీతానగరం – అజ్జాడ రహదారిలోని లక్ష్మీపురం, కృష్ణరాయపురం, బూర్జ గ్రామాలలో రహదారి పూర్తిగా పాడైనట్టు చెప్పారు. దీనికి మరమ్మతులు చేపట్టేందుకు రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనుల కోసం టెండర్లను పిలిచామని కాంట్రాక్టర్ ఎంపిక పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు.

రెండు రోజుల్లో..

మండలంలోని ప్రమాదాలకు నిలయంగా ఉన్న సీతానగరం – చినబోగిల రహదారికి రెండు రోజుల్లో మరమ్మతులు చేపడతామని సీతానగరం ఆర్అండ్‌బీ ఏఈఈ కె.విజయకుమార్ తెలిపారు. ఈ నెల 14న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన ప్రమాదానికి నిలయంగా జాతీయ రహదారి అనే వార్తపై శనివారం స్పందించి ప్రకటన విడుదల చేశారు. సీతానగరం– చినబోగిల రహదారిలోని రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులు జరుగుతున్నందున వర్షాల వలన వచ్చే నీటిని ప్రస్తుతం ఉన్న రోడ్డు మీదుగా మళ్లించడం వలన తారు రోడ్డు పూర్తిగా పాడైనట్లు తెలిపారు. దీనికి మరమ్మతులు చేయమని రైల్వే వారికి ఇది వరకే తెలియజేసినప్పటికీ, వారి నుంచి ఎటువంటి స్పందన రాలేదన్నారు. తమ శాఖ ద్వారా మరో రెండు రోజుల్లో మరమ్మతులు చేపడతామని వివరించారు.

ఇలా అయితే ఎలా..


జిల్లా కేంద్రం ప్రారంభంలో అంతర్‌రాష్ట్ర రహదారిపై వరుసగా నిలిపేసిన లారీలు

పార్వతీపురం రూరల్: నిత్యం వందలాది వాహనాలు రాత్రి, పగలు తేడా లేకుండా పార్వతీపురం జిల్లా కేంద్రం మీదుగా ఉన్న అంతర్‌రాష్ట్ర రహదారిపై రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికే రహదారి ఉండాల్సిన విస్తీర్ణం కంటే తక్కువ పరిధిలో ఉండి రహదారిపై అక్కడక్కడ గుంతలు ఏర్పడి వాహన చోదకులకు ఇబ్బందిగా ఉన్న నేపథ్యంలో కొంతమంది భారీ వాహన చోదకులు తమ ఇష్టానుసారంగా అంతర్‌రాష్ట్ర రహదారిపై వరుసగా వాహనాలను నిలిపివేసి తోటి వాహన దారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నిర్దిష్ట వేగంతో ప్రయాణించే ప్రాంతాల్లో అలాగే ఇప్పటికే ఇరుగ్గా ఉన్న కూడళ్లలో లారీలను రహదారిపై నిలిపివేసి గంటల తరబడి ఒక వైపు దారిని ఆక్రమించే విధంగా ఉండిపోతున్నారు. ఈ సమస్యకు పోలీసు అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్దేశించిన ధరలకే ఎరువులు విక్రయించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసన్నకుమార్

సీతానగరం: మండలంలోని ఎరువులు డీలర్లు నిర్దేశించిన ధరలకే రైతులకు ఎరువులు విక్రయించాలని తహసీల్దార్ బి.ప్రసన్నకుమార్ అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎరువుల షాపులు తనిఖీ నిమిత్తం ఆయనతో పాటు ఎస్ఐ ఎం.రాజేష్, ఏవో ఎస్.అవినాష్ శనివారం ఇక్కడకు వచ్చారు. ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఎరువుల నిల్వలు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు ఎరువులు విక్రయించాలని సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏవో మాట్లాడుతూ మండలంలోని మూడు రైతు సేవా కేంద్రాలు, రెండు పీఏసీఎస్‌లకు యూరియా వచ్చిందని తెలిపారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులతో సంప్రదించాలని సూచించారు.

పైపులైన్‌కు మరమ్మతులు


పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది

మక్కువ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మరమ్మతులకు గురైన పైపులైన్‌కు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జోగారావు, ఈవో శ్రీనివాస్ పర్యవేక్షణలో మరమ్మతులు శనివారం చేపట్టారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయానికి కూరాకుల ఎగువ, దిగువ వీధులు, జాలరీవీధి, నాయిబ్రాహ్మణ వీధులకు చెందిన మహిళలు డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణను కలిసి తాగునీటి సమస్యపై వినతిపత్రం అందించారు. దీంతో అధికారులు స్పందించి బీసీ కాలనీ సమీపంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ వద్ద నీరు లీకై, కుళాయిలుకు తాగునీరు సరఫరా పూర్తి స్థాయిలో కాకపోవడంతో మరమ్మతులు చేయించారు. సీపీడబ్ల్యూ స్కీం వద్ద పంపింగ్ వాల్ ఏర్పాటు చేసి, పూర్తి స్థాయిలో ట్యాంక్‌కు నీరు ఎక్కించి, కుళాయిలుకు తాగునీరు సరఫరా అందిస్తామని జేఈ జోగారావు తెలిపారు.

దివ్యాంగుల ఉసురు తగులుతుంది..


ఎంపీపీ మజ్జి శోభారాణి

పార్వతీపురం రూరల్: దివ్యాంగులకు ఆధారమైన పింఛన్లను తొలగించి వారిని కూటమి ప్రభుత్వం రోడ్డున పడేసిందని దివ్యాంగులు ఉసురు తగులుతుందని ఎంపీపీ మజ్జి శోభారాణి అన్నారు. గతంలో ఇలాంటి చర్యలకు పాల్పడిన ప్రభుత్వాలు లేవని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమానికి పెద్దపీట వేసి వృద్ధులను, దివ్యాంగులను ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ఆదుకుంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. దివ్యాంగులు శారీరక, మానసిక సమస్యలతో సతమవుతున్నారని, అలాంటి వారి పింఛన్లు తొలగించడం నీచమైన చర్య అని అన్నారు. తొలగించిన పింఛన్లు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మంచి విద్యనందించాలి


గుడివాడ కాలనీ ప్రాథమిక పాఠశాలను పర్యవేక్షించిన ఎంఈవో 2

బలిజిపేట: విద్యార్థులకు మంచి విద్యను అందించాలని ఎంఈవో – 2 కె.శ్రీనివాసరావు తెలిపారు. పలగర పంచాయతీ గుడివాడ కాలనీ ప్రాథమిక పాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థులకు సంబంధించిన అకడమిక్ పుస్తకాలను పరిశీలించి వారి నైపుణ్యాలను పరీక్షించారు. మంచి రాత నేర్పించి, మంచి విద్యను వారికి అందించాలన్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. నూతన విద్యా విధానాన్ని అనుసరించి విద్యాబోధన జరపాలని సూచించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి సంతృప్తి చెందారు. సీఆర్‌టీ సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం


తయారు చేసిన రాకెట్ల నమూనాలతో మామిడిపల్లి విద్యార్థులు

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. 2023 ఆగస్టు 23న ప్రయోగించిన చంద్రయాన్ – 3 విజయవంతం కావడంతో ఆ రోజున నేషనల్ స్పేస్ డే జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

పార్వతీపురం రూరల్:

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక అన్నారు. కార్యాలయ ఆవరణలో ఆమె అధ్యక్షతన శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో నీటి నిల్వలతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి నివారణ పట్ల అవగాహన కలిగి వుండాలని ఆమె అన్నారు. పార్వతీపురం మున్సిపల్ సిబ్బంది కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో పాగయంత్రంతో దోమలు నివారణకు ఫాగింగ్‌ను నిర్వహించారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రజల భాగస్వామ్యం అవసరం

పార్వతీపురం టౌన్: పట్టణ పరిశుభ్రతకు ప్రజల భాగస్వామ్యం అవసరమని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీర్, మెప్మా సీఎంఎంలు, సచివాలయ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మక్కువలో..

మక్కువ: మండల కేంద్రం మక్కువలో శనివారం ఈవో బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలు వీధులలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంటలో..

పాచిపెంట: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని సాలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ అన్నారు. శనివారం మండల కేంద్రమైన పాచిపెంటలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అంగన్‌వాడీ ఉద్యోగులు, వెలుగు సిబ్బంది, వైద్య సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ సంతోషి,మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ, ఎంపీడీవో పాత్రో, ఏఎంసీ డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్‌జైల్ తనిఖీ


ఖైదీలతో మాట్లాడుతున్న అదనపు జడ్జి, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోసెఫిన్

పార్వతీపురం టౌన్: అదనపు జడ్జి, ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జోసెఫిన్ శనివారం స్థానిక సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. జైలులో వసతులను పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితులు పట్ల ఆరా తీశారు. నాణ్యమైన ఆహారం అందుతుందా.. లేదా.. అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. చక్కటి నడవడిక, నైతిక విలువల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. జైలు రికార్డులను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. జైలులోని పలు విభాగాలను పరిశీలించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి ఖైదీలకు వివరించారు. ఒక అడ్వకేట్, ఒక పారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయసలహాలు అందిస్తారని చెప్పారు. ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేసుకోవాలని జడ్జి సూచించారు. ఖైదీల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలను న్యాయమూర్తి సబ్ జైల్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. 70 ఏళ్ల పైబడిన ఖైదీలకు, అనారోగ్యంతో బాధపడే వారికి బెయిల్ మంజూరయ్యేలా కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

మన్యం జిల్లాను అభివృద్ధి చేయాలి


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జీవన్

పార్వతీపురం టౌన్: మన్యం జిల్లాను అభివృద్ధి చేయాలని సీపీఐ ఎమ్ఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్ అన్నారు. సీపీఐ ఎమ్ఎల్ రెడ్ స్టార్ జిల్లా కార్యవర్గ సమావేశం ఆరినాన సీతమ్మ అధ్యక్షతన శనివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యం వలన రైతులు నష్టపోతున్నారన్నారు. తోటపల్లి కుడి, ఎడమ కాలువలు, పెద్దగడ్డ, జంపర్లకోట ప్రాజెక్టులు పూర్తి చేసి చివర వరకు నీరు అందించాలన్నారు. జంఝావతి ప్రాజెక్టు సంబంధించి సమస్యను పరిష్కారించాలని, జిల్లాలో విస్తారంగా ఉన్న గెడ్డలు, వాగులపై చెక్ డ్యామ్‌లు నిర్మించి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. పూర్ణ పాడు – లాబేసు వంతెనను సత్వరమే పూర్తి చేయాలన్నారు. లచ్చయ్యపేట షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి, కార్మికులకు, రైతులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీడి, పసుపు, జొన్న ప్రాసెసింగ్ చేసే కంపెనీలు ఏర్పాటు చేయాలని, యువతకు ఉపాధి కల్పించాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, బొత్స మోహనరావు, గుజ్జ జనార్దన్, బిడ్డక రామ్మూర్తి పత్తిక మోహనరావు, మండంగి సింగన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జిల్లా జడ్జి మరియు మండల న్యాయ సేవా కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదరరావు

పార్వతీపురం టౌన్: అసంఘటిత కార్మికులకు చట్టాలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని రెండవ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదరరావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో అసంఘటిత కార్మికుల సంక్షేమ పథకాలపై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అసంఘటిత రంగం అనధికారిక రంగంలో ఎక్కువగా గ్రామీణ కార్మికులు, పట్టణ కార్మికులు ఉన్నారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయని తెలిపారు. కార్మిక శాఖలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి సవివరంగా తెలియజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లాలో ఎంతమంది కార్మికులు లబ్ధి పొందుతున్నారో ఆరా తీశారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఏర్పాటు చేసిన 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి న్యాయ సలహాలను పొందవచ్చని జడ్జి కార్మికులకు సూచించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ పి.సువర్ణ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు, లోక్ అదాలత్ సభ్యులు టి.జోగారావు, అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థ నుంచి ఎస్.సత్యనారాయణ, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల ఆందోళన


మహాసభ వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వీఆర్ఏలు

మక్కువ: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏల యూనియన్ జిల్లా కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో వీఆర్ఏలు ఆర్ఐ శ్రీనివాసరావుకు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా కార్యదర్శి కృష్ణారావు మాట్లాడుతూ వీఆర్ఏలకు పే స్కేల్ అమలు చేయాలన్నారు. అర్హత కల్గిన వీఆర్ఏలను, వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అక్రమ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. అటెండర్, నైట్ వాచ్‌మన్‌ల పదోన్నతి కోటాను 20శాతం నుంచి 70శాతానికి పెంచాలన్నారు. పై సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకుంటే భవిష్యత్ పోరాటానికి సిద్ధమవుతామన్నారు. ఈ సందర్భంగా పాలకొండలో జరగనున్న మహాసభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల నాయకులు జి.పవన్, డి.సింహాచలం, నిర్మల, కాంతమ్మ, రాధ, ఈశ్వరరావు, ప్రసాదు, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

సురవరం మృతికి సంతాపం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

పార్వతీపురం టౌన్: సీపీఐ పార్టీ ఆల్ ఇండియా మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతికి సీపీఎం పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలిపింది. ఈ మేరకు శనివారం సుందరయ్య భవనంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుంచి పేద ప్రజల తరపున, కష్టజీవులు తరపున పోరాటాలు చేశారని, తన కుటుంబం స్వాతంత్ర్య ఉద్యమం స్ఫూర్తి పొందిన కుటుంబమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సురవరం మృతి తీరని లోటు

పార్వతీపురం రూరల్: సీపీఐ అగ్రనేత సురవరం సుధాకరరెడ్డి మృతి యావత్ భారత దేశానికి తీరని లోటని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ అన్నారు. ఆయన దళిత, గిరిజన, బడుగు, బలహీన ప్రజల కోసం నిరంతరం పోరాటం చేశారని పేర్కొన్నారు.

నీటి నిల్వలతోనే వ్యాధులు

పార్వతీపురం రూరల్: వర్షాకాలంలో ప్రబలే వ్యాధులకు నీటి నిల్వలే కారణమని డీఎంహెచ్‌వో డా. ఎస్.భాస్కరరావు అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. మండలంలోని బందలుప్పి గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వైద్య సిబ్బందితో కలసి పాల్గొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిసరాలను శుభ్రపరచి సమీపంలో ఉన్న నీటి నిల్వలను గుర్తించి తొలగించారు. అలాగే బందలుప్పి గ్రామంలో కాలువల్లో పూడికలు తీయించి దోమలు లార్వా ప్రదేశాలను గుర్తించి పారబోయించారు. కార్యక్రమంలో డీఎంవో మణి, ఏపీడీ మియాలజిస్టు డా.కౌశిక్, స్థానిక వైద్యాధికారి డా. శ్రీకాంత్, మరికొందరు వైద్య సిబ్బంది ఉన్నారు.